# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-20- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 85 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## రాబోయే ఏ ఎన్నికలైనా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను సైతం మోసం చేస్తోంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు


వికారాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను సైతం మోసం చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాబోయే ఏ ఎన్నికలు అయినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత మొదటి సారి వికారాబాద్ జిల్లాకు రాంచందర్ రావు వచ్చారు. జిల్లా పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంచందర్ రావుకు ఘనస్వాగతం పలికారు. ఆయనను గజమాలతో సన్మానించారు బీజేపీ శ్రేణులు. తేజ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని రాంచందర్ రావు ప్రసంగించారు.

మిగతా 2లో







## అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయండి

- యూరియా కొరతతో రైతాంగం ఇబ్బందులు
- కేటాయింపు కంటే తక్కువగా సరఫరా చేసిన కేంద్రం
- రైతుల తరపున ఎంపీల వినతిపత్రం
- రాష్ట్ర మంత్రుల లేఖలపై కూడా స్పందన లేకపోవడం
- తక్షణం సరఫరా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రైతాంగానికి అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేటాయించిన మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయకపోవడంతో తలెత్తుతున్న సమస్యలను

మిగతా 2లో

## కేసీఆర్ నాకు అపాయింట్‌మెంట్ ఇస్తారో లేదో..

- ఆయనకు నా మొఖం చూడటం ఇష్టం ఉందో లేదో
- సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): బీసీ రిజర్వేషన్ బిల్లుపై సుప్రీంకోర్టు తీర్పుకోసం ఎదురు చూస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండిరగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు.

2లో

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్లు
- పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదన్న కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపణ

2లో





## తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను ఇవ్వడం లేదు

- యూరియాను తీసుకువచ్చే బాధ్యతను కేంద్రమంత్రులు తీసుకోవాలని డిమాండ్
- బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయని ఆరోపణ

## కాంగ్రెస్ కాళేశ్వరంపై బురద జల్లడం సిగ్గుచేటు

- సాగునీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సీఎం రేవంత్ సర్కార్
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వడం చేతకాదు..
- సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగ్గా కట్టించే తెలివిలేదు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



## రాష్ట్రవ్యాప్తంగా దంచికొడుతున్న వానలు

- మరో 2 రోజులు ఇవే పరిస్థితులు!
- వరద నీరు ఇళ్లల్లోకి రావడంతో తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు
- వరద ఉద్ధృతి పెరగడంతో ఉగ్రరూపం దాల్చిన పలు ప్రాజెక్టులు
- ప్రాజెక్టుల వద్ద గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్న అధికారులు

వికారాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, వంకలు పొంగి ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాలు నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నిజామాబాద్ జిల్లా సాలుర వద్ద మంజీర నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

మిగతా 2లో






తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ సభ్యులు కేంద్ర మంత్రులకు వివరించిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో తెలంగాణ రాష్ట్రానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు రైతాంగానికి తలెత్తాయని పేర్కొన్నారు. ఈ విషయంలో పార్లమెంట్ సభ్యులు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకి, సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

యూరియా సరఫరా విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర మంత్రి కి వివరించడమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాలుగా లేఖలు రాసిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రం వివక్ష చూపుతోందని అన్నారు. రైతుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా ఎంపీలు ఆందోళన సాగిస్తున్నప్పటికీ కోటా మేరకు యూరియా విడుదల చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించారు. అవసరమైన మేరకు తక్షణం యూరియా సరఫరా చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదని, ఆ కమిషన్ సమర్పించిన నివేదికను కొట్టివేయాలని వారు కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్, హరీశ్ రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ విధంగా ఉందని వారు పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# కాంగ్రెస్ కాళేశ్వరంపై బురద జల్లడం సిగ్గుచేటు


హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. సాగునీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సీఎం రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని గుడిబండ పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ కొట్టుకుపోయిన ఘటనపై కేటీఆర్ స్పందించారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వడం చేతకాదు.. సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగ్గా కట్టించే తెలివిలేదు.. చివరికి ఓ చెక్ డ్యామ్‌ను కూడా నిర్మించలేని కాంగ్రెస్ సన్నాసులు కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం సిగ్గుచేటు అని కేటీఆర్ మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లోని అడ్డాకుల మండలం గుడిబండ పెద్ద వాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్ డ్యామ్ రెండు నెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నాసిరకం పనులు చేసి రైతుల పొలాలు, మోటర్ పైప్ లైన్లు, చివరికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా కొట్టుకుపోయే దుస్థితికి కారణమైన ప్రతి ఒక్కరిపై సర్కారు చర్య తీసుకుని బాధితులను ఆదుకోవాలి. ప్రాజెక్టుల మాట దేవుడెరుగు చివరికి ఒక్క ఇటుక కూడా సరిగా పేర్చలేని ఈ దద్దమ్మ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సర్కారు ముక్కు నేలకు రాసి మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టుపై నోరు పారేసుకోమని లెంపలేసుకోవాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మూత్ర విసర్జన చేస్తూ మృత్యు ఒడిలోకి..



సూర్యాపేట, (తెలంగాణ ముచ్చట్లు) :

వర్షాకాలంలో ఎక్కడంటే అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారా..? అయితే బీ కేర్‌ఫుల్. అజాగ్రత్తగా ఉన్నారంటే ప్రాణాలకే ప్రమాదం. ఎందుకంటే.. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మూత్ర విసర్జన చేయడం ప్రమాదకరం. విద్యుత్ సరఫరా జరిగే ఏరియాల్లో మూత్ర విసర్జన చేయడమంటే ప్రాణాల మీదికి కొని తెచ్చుకున్నట్టే. ఇలా చేయడం వల్ల విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. దీనికి ఉదాహరణే సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇవాళ చోటు చేసుకున్న ఘటన. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉన్న వాణిజ్య భవన్ పక్కనే ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేస్తుండగా.. విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అప్రమత్తమైన స్థానికులు అక్కడికి చేరుకోగా, అప్పటికే అతను ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని పట్టణానికి చెందిన దంతాల చక్రాధర్ (50) గా గుర్తించారు.

## కేసీఆర్ నాకు అపాయింట్‌మెంట్

# ఇస్తారో లేదో..

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): బీసీ రిజర్వేషన్ బిల్లుపై సుప్రీంకోర్టు తీర్పుకోసం ఎదురు చూస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండిరగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 90రోజుల్లో రాష్ట్రపతి బీసీ రిజర్వేషన్ బిల్లు పూర్తిచేయాలని చెప్పకొచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఇంకా ఆలస్యమైతే పార్టీ పరంగా ఇద్దామని అందరినీ కోరి ఎన్నికలకు వెళ్లడమే తమ ముందున్న ప్రత్యామ్నాయమని వెల్లడిరచారు. ఈ నెల 23వ తేదీన జరిగే పీఏసీలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతికి మద్దతు కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుస్తారా అని మీడియా ప్రతినిధులు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అధిష్టానం ఏం ఆదేశిస్తే అదే చేస్తానని తెలిపారు. కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇస్తారో లేదో.. ఆయనకు తన మొఖం చూడటం ఇష్టం ఉందో లేదోనని సరదాగా వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి. కేసీఆర్ ఆస్పత్రిలో ఉంటే తానే వెళ్లి పరామర్శించానని గుర్తుచేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఎంపిక చేసిందని చెప్పకొచ్చారు. తన నిర్ణయం ఏం లేదని.. ఇండియా కూటమి నిర్ణయమని స్పష్టం చేశారు. తాను రెగ్యులర్‌గా ఆయనను కలుస్తానని తెలిపారు. తాను జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్‌కు వెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాబోయే ఏ ఎన్నికలైనా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారు

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని రాంచందర్ రావు ధ్వజమెత్తారు. ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు రాంచందర్ రావు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని వెల్లడిరచారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు.



## తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను

# ఇవ్వడం లేదు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ యూరియాను రాష్ట్రానికి తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు ఇక్కడ ఆందోళన చేస్తుంటే కిషన్ రెడ్డి ఢల్లీలో నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విషయంలో కిషన్ రెడ్డి, బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు యూరియా కోసం కేంద్రానికి లేఖలు రాశారని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ లు లోపాయికారి ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు.

# రాష్ట్రవ్యాప్తంగా దంచికొడుతున్న వానలు

(మొదటి పేజీ తరువాయి)

నిజాం సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంజీరాలో వరద ప్రవాహం మరింత పెరిగింది. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు సూచించారు. నందిపేట్ మండలంలోని ఉమ్మెడలోని ఉమామహేశ్వర ఆలయం నీట మునిగింది.

శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీగా నీరు చేరడంతో ఉమ్మెడ బ్రిడ్జి వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి పుష్కర ఘాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సాయిచైతన్య పరిశీలించారు. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలకు హైదరాబాద్‌లో అంబర్‌పేట్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే మూసారాంబాగ్ బ్రిడ్జి ఒక భాగం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని సగం వరకు కొట్టుకుపోయింది. వాహనదారులు వెళ్లకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మరో మార్గంలోకి మళ్లిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తిలో చోటుచేసుకుంది. మోత్కూరు మండలానికి చెందిన శివరాత్రి నవీన్, స్నేహితులతో కలిసి కాలువలో చేపలు పట్టబోతు కాలుజారి గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. భువనగిరి మండలం వడపర్తి కత్వ నుంచి పెద్ద చెరువుకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇరిగేషన్ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిరది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాలిపేరు జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నాయి. జలాశయం వద్ద పది గేట్లు ఎత్తి 24 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడిరచింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.





అదరగొడుతున్న శ్రీశైలం ప్రాజెక్టు డ్రోన్ విజువల్స్



# నిండుకుండల్లా ప్రాజెక్టులు

## తెరుచుకున్న గేట్లు విజువల్స్ చూసి తీరాల్సిందే

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణలో వర్షాలు, వరదలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. గోదావరి, కృష్ణా పరివాహకంలోని ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 38 గేట్లు ఎత్తి, నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ 26 గేట్లెత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. ప్రాజెక్టులు పూర్తి నిండుకుండలా మారడంతో అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఉధృతంగా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి లక్షా 45 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా 38 ప్రధాన గేట్ల ద్వారా లక్షా 73 వేల 578 క్యూసెక్కులు గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ ఎస్కేప్ గేట్ల ద్వారా 3వేల 300 క్యూసెక్కులు ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 18వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4వేల 700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను 1089 అడుగుల నీటి నిల్వ ఉంది. 80.5 టీఎంసీలకు గాను 73.37 టీఎంసీలు ఉన్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతుంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం ఇన్ ఫ్లో 85 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా 3 గేట్లను పైకెత్తి 50వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1405 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1403.33అడుగులుగా ఉంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరుతుంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు కడెం, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో జలాశయంలో భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సంబంధించి 62 గేట్లలో అధికారులు 35 గేట్లు తెరిచి లక్షా 87 వేల 36 క్యూసెక్కుల నీటిని గోదావరి నది దిగువకు వదులుతున్నారు.

# చలో ప్రజా భవన్.!

- **సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పై చలో ప్రజా భవన్ జయప్రదం చేయండి: పి ఎస్ సి డబ్ల్యూ యు.**

**సత్తుపల్లి, ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి పట్టణంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు పెంచాలని, కార్మికుల యొక్క సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 22న తలపెట్టిన చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్( పి ఎస్ సి డబ్ల్యూ యు) కొత్తగూడెం రీజియన్ అధ్యక్షులు అమర్లపూడి శరత్ కార్మికులకు పిలుపు నిచ్చారు.

సింగరేణి క్వార్టర్, సింగరేణి పిఓ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులతో జరిగిన గ్రూప్ మీటింగ్ జనరల్ బాడీలో శరత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్న కార్మికుల వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచితే రాష్ట్ర ప్రభుత్వం ఖజానా అవసరం లేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ కార్మికులకు చాలా చోట్ల పి ఎఫ్ లు అందించడం లేదని వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని వారు అన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 22న జరుగు కార్యక్రమానికి కార్మికులందరూ దరఖాస్తులతో ప్రజా భవన్ తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బి రమేష్, ఎం రవి, జీ రమేష్, ఎం నాగరాజు, ఎస్ జయరాజు, శ్రీ లక్ష్మీ, రాణి, జయమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.








# భారత రాజ్యాంగ పరిరక్షణపై వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

- **స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **విద్యార్థుల్లో రాజ్యాంగ స్ఫూర్తి పెంపొందించాలి**
- **ప్రజాస్వామ్యం రక్షణ అందరి బాధ్యత**

**ఏఎస్ రావునగర్,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**

ఏ ఎస్ రావు నగర్ డివిజన్ కమలానగర్ సిఐటియు కార్యాలయ ప్రాంగణంలో స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా "భారత రాజ్యాంగ పరిరక్షణ" అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్ఫూర్తి గ్రూప్ నాయకుడు కృష్ణమాచార్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాన్ని వివిధ రూపాల్లో జరిపామని, క్విట్ ఇండియా కార్యక్రమం, పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, ఈసీఐఎల్ పరిసర ప్రాంతంలోని 12 విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విజేతలకు శాస్త్రవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవితానికి సంబంధించిన పుస్తకాలు, యువకవి రామ్‌శెట్టి రోశయ్య రచనలు బహుమతులుగా అందజేశామని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం, సోషలిజం, సమాఖ్య భావం రాజ్యాంగ బలం అని, కానీ నేటి పాలకులు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారని స్పష్టంచేశారు. రాజ్యాంగాన్ని రక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రోజా రాణి విద్యార్థులు చదువులో నిబద్ధత చూపాలని, సైబర్ క్రైమ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ స్వాతంత్ర సమర చరిత్రను వివరించారు. విద్యార్థి నాయకుడు శ్యామ్ చదువు–పోరాటం రెండూ నిరంతరంగా కొనసాగాలని పిలుపునిచ్చారు.

చివరగా రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞగా పఠింపజేసి, జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు. చైతన్య కాన్సెప్ట్ స్కూల్, నారాయణ స్కూల్, ఎస్ఆర్‌డిజి స్కూల్, సెంట్ జోసెఫ్ స్కూల్, వసుంధర మహిళా డిగ్రీ కాలేజ్, సాయి సుధీర్ డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పి. సత్యం, రోజా రాణి, శ్రీమన్నారాయణ, జయరాజ్, గుమ్మడి హరిప్రసాద్, భాస్కర్‌రావు, గౌసియా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ఇల్లు కాలిపోయిన కుటుంబానికి అండగా.!

- **మేము సైతం ఫౌండేషన్.**

**దమ్మపేట,ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట మండలం, గాండ్లగూడెం గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు పూర్తిగా దగ్ధమైనది. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో ఉండడం వలన విషయం తెలుసుకున్న దమ్మపేట "మేము సైతం ఫౌండేషన్" వారు దాతల సహకారంతో ఆ కుటుంబానికి 50 కేజీల రైస్, నిత్యవసర సరుకులు, వంట సామాగ్రి, దుస్తులు, దుప్పట్లు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మేము సైతం ఫౌండేషన్ ఫౌండర్ తంబళ్ల రవి, టీం సభ్యులు కోమటి వేణు, రాయల పోలయ్య, దారా విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# హెచ్.ఆర్.ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గా పల్లిపాము డానియెల్ నియామకం

**సత్తుపల్లి, ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు):**



సత్తుపల్లి పట్టణానికి చెందిన పల్లిపాము డానియల్ ని బహుజన అభ్యుదయ సేవా సమితి అనుబంధ సంస్థ అయిన హ్యూమన్ రైట్స్ సొసైటీ సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ సొసైటీ కో ఫౌండర్ ఆదూరి మణి, సంస్థ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం, డానియల్ ని నియమించారు.

ఈ సందర్భంగా డానియల్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన సంస్థ నాయకులు ఆనందం, మణి లకు, జాతీయ అధ్యక్షులు, లీగల్ అడ్వైజర్ ఇనపనూరి మహేంద్రనాధ్, నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు చిల్లిముంత వెంకటేశ్వరరావు, కువ్వారపు విజయరావు, అయిలూరి శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వరావు, కన్నెపోగు వెంకటేశ్వర్లు (కె వి ఆర్ )లకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు నా వంతుగా మానవ హక్కులు చట్టాలపై అవగాహన కల్పించుటకై కృషి చేస్తానని ఆయన అన్నారు.



# వైభవంగా అల్వాలలో పోచమ్మ బోనాలు

- **భక్తి శ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్తులు**
- **మొక్కుబడిగా కోళ్లు, మేకలు నైవేద్యంగా సమర్పణ**

**వనపర్తి, ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.ఉదయం నుంచి గ్రామ వీధులన్నీ పండుగ వాతావరణంలో కళకళలాడాయి. మహిళలు సంప్రదాయ చీరలు ధరించి తలపై అలంకరించిన బోనాలు మోసుకుంటూ ఊరేగింపుగా పోచమ్మ గుడికి చేరుకున్నారు. డప్పులు, తాళాలు, కీర్తనల మధ్య భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి మరింత పెంచారు. మొక్కుబడులు తీర్చుకునే భాగంగా భక్తులు కోళ్లు, మేకలను పోచమ్మ తల్లికి నైవేద్యంగా అర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గ్రామమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రతి సంవత్సరం జరిగే బోనాల పండుగ మన గ్రామానికి ఐక్యత, భక్తి భావాలకు ప్రతీక అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.అల్వాల గ్రామంలో జరిగిన ఈ పోచమ్మ బోనాలు అందరినీ ఆకట్టుకొని విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో గొర్రెల కాపరి మృతి

**పెద్దమందడి,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండల కేంద్రంలోని మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ షాక్ తో గొర్రెల కాపరి రాగమోని మల్లయ్య (40 ) మృతి చెందారు. ఆర్ ఐ గణేష్ వివరాల ప్రకారంగా గొర్రెలను మేపడానికి వ్యవసాయ పొలాలకు వెళ్లడంతో అక్కడ బోరు బావి దగ్గర విద్యుత్ వైరు తగిలి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ నుండి మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం నుండి ఆదుకోవాలని గ్రామస్తులు అన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పీఎంఏవై–జి ఇళ్ల భద్రతపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య

- **ఇళ్ల నిర్మాణ లోపాలపై ఆవేదన**
- **ప్రజల ప్రాణాలకు ప్రమాదమని హెచ్చరిక**
- **రాష్ట్రాల వారీగా వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి**
- **తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**న్యూఢిల్లీఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పిఎంఏవై-జి) కింద నిర్మిస్తున్న ఇళ్లలో భద్రతా లోపాలు తీవ్రంగా ఉన్నాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణం నాణ్యత లేకపోవడం, విద్యుత్ సమస్యలు తలెత్తడం వల్ల గ్రామీణ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.2021 నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఎన్ని ఇళ్లలో ఇలాంటి సమస్యలు వచ్చాయో రాష్ట్రాల వారీగా వివరాలు ఇవ్వాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా చర్యలు ఏవీ తీసుకున్నారో స్పష్టంగా తెలియజేయాలని ఆమె కోరారు.

ఈ ప్రశ్నకు స్పందించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, పీఎంఏవైజి పథకం కింద లబ్ధిదారులకు 1.20 లక్షల నుండి 1.30 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. స్థానిక మేస్త్రీలకు శిక్షణ ఇచ్చి ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే ఫిర్యాదులను 15 రోజుల్లో పరిష్కరించే విధానం అమల్లో ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, పీఎంఏవైజి పథకం గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనకరమైనదే అయినా, భద్రతా సమస్యలు నిర్లక్ష్యం చేయరానివని అన్నారు. బలహీన వర్గాల ప్రజలు ప్రాణహాని ఎదుర్కోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కేంద్ర సర్కార్ కుట్రలతో యూరియా కొరత

- **రైతు ద్రోహమన్న వరంగల్ ఎంపీ కడియం కావ్య**
- **తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ రాజకీయ ఆటలు**
- **కేటాయించిన యూరియానే ఇవ్వక కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శ**
- **రైతుల సమస్యలు తీరే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరిక**
- **కేటాయించిన 8.30 లక్షల టన్నుల్లో 5.32 లక్షల టన్నులే విడుదల చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణకు కేటాయించిన యూరియాను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంపీలతో కలిసి ఆందోళనలో పాల్గొన్న ఆమె, 'మా వాటా – మాకు ఇవ్వండి, తెలంగాణ రైతులను కాపాడండి' అనే నినాదాలతో ప్లకార్డులు పట్టుకొని కేంద్రంపై మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, తమకు రావాల్సిన వాటాను కేటాయించకుండా కేంద్రం కృత్రిమ కొరత సృష్టిస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి కేటాయించిన వాటాను ఇవ్వకపోవడం రైతుల సమస్యలను మరింత తీవ్రం చేస్తోందని, తద్వారా తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న ఉద్దేశంతోనే బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు.

తెలంగాణకు మొత్తం 8.30 లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల టన్నులనే విడుదల చేసిందని ఎంపీ వివరించారు. ప్రతి నెల రావలసిన కోటా కన్నా తక్కువగా సరఫరా చేసి, రైతులను అయోమయంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. జూన్ చివరి వారంలోనే సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రిని కలసి యూరియా సరఫరా చేయాలని కోరినా, ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.

"ఏనాడూ రైతుల పక్షాన నిలవని బీజేపీ మళ్లీ రైతు ద్రోహం చేస్తోంది. తెలంగాణ రైతులకు న్యాయం జరగకపోతే, పార్లమెంట్ సమావేశాల ముగింపు వరకు మకరద్వార్ ముందు మా ఆందోళన కొనసాగుతుంది" అని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.

# మల్కిమియన్ పల్లి లో ఘనంగా బోనాల పండుగ

- **గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు రవినాయక్**

**ఘనపూర్,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు) :**



వనపర్తి జిల్లా ఘనపూర్ మండల పరిధిలోని మల్కిమియన్ పల్లి గ్రామం లో, మంగళవారం గంగమ్మ తల్లి నల్ల పోచమ్మ అమ్మవారు వనకన్యలు పోతురాజుల నృత్యాలు పలువురి ఆకట్టుకున్నాయి

సెల్ఫీలతో పలువురు భక్తులు పోటీపడ్డారు. శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి దేవస్థానం లో, శ్రావణ మాస బోనాల జాతర ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించడం నిర్వహించుకున్నారు. ముందుగా గ్రామస్తులు, పోచమ్మ దేవాలయం వెళ్లి పూజా అనంతరం రథంపై కూర్చున్న అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా బోనాలు సమర్పించడం మహిళలు ఆటపాటలతో నాట్యాలు చేస్తూ బయలుదేరిన భక్తులు. దారి పొడుగునా వేషధారణలు, పోతురాజుల నృత్యాలతో, ఊరేగింపుగా శ్రీ పోచమ్మ అమ్మవారికి ఆలయ వద్దకు చేరుకొని మొక్కులు సమర్పించుకున్న భక్తులు. ఈ కార్యక్రమంలో ఎం.రవి నాయక్ మాట్లాడుతూ.. గంగమ్మ తల్లి నల్ల పోచమ్మ వానకన్యలు పోతురాజుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయని, అంగరంగ వైభవంగా శ్రావణమాస బోనాల జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించినారని మైసమ్మ పెద్దమ్మ ఎల్లమ్మ వంటి పేర్లతో పిలిచే పోచమ్మ తల్లిని మహంకాళి అవతారంగా భావిస్తారని, శ్రావణ మాసంలో పోచమ్మ తల్లికి మహిళా భక్తులు ఉపవాసాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తారని అన్నారు. ప్రతి సంవత్సరం అత్యంత భక్తిశ్రద్ధలతో పలువురు భక్తులు బోనాలు సమర్పిస్తారని చూడడానికి పక్కగ్రామాలతో పాటు, గ్రామ ఆడపడుచులు, వారి బంధువులు, పెద్ద ఎత్తున పాల్గొని గ్రామంలో సుఖశాంతులు కలగాలని అమ్మవారి దీవెనలు మా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని జిల్లా దిశ కమిటీ మెంబెర్ రవి నాయక్ కోరుకున్నారు.

# దమ్మాయిగూడ–నాగారం రహదారి గుంతల మయం

- **వాహనదారుల నడుములు విరిగే పరిస్థితి**
- **వర్షా ల వల్ల ప్రమాదాల పెరుగుదల**
- **విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు**

**దమ్మాయిగూడ, ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం దమ్మాయిగూడ చౌరస్తా నుండి నాగారం వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయాలంటే నడుములు విరిగిపోతున్నాయన్నట్లుగా పరిస్థితి ఏర్పడింది.ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా పట్టించుకునే వారు లేరని విమర్శిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా రహదారి పరిస్థితి మాత్రం అలాగే కొనసాగుతుందంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారిపై గుంతలు నీటితో నిండిపోవడంతో ప్రమాదాలు పెరిగాయి. ఇప్పటికే ఐదుగురు వాహనదారులు గుంతల్లో పడి గాయపడ్డారని సమాచారం. చిన్న దూరం వెళ్లాలన్నా 30 నుండి 45 నిమిషాలు పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోజూ స్కూల్స్‌కి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి అధికారి విట్టలయ్యలను సంప్రదించగా, రాబోయే రెండు రోజుల్లో గుంతలను పూడుస్తామని హామీ ఇచ్చారు.






# చెక్ డ్యామ్ లను, చెరువును సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు

**వనపర్తి, ఆగస్టు19 (తెలంగాణ ముచ్చట్లు):**

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెద్ద మందడి మండలంలోని పూర్తిస్థాయిలో నిండిన చెక్ డ్యాములను, చెరువులను బిఆర్ఎస్ నాయకులు సందర్శించారు. మంగళవారం పెద్దమందడి మండలంలోని జగతి పల్లి గ్రామ చెక్ డ్యామ్, చిలుకటోనీ పల్లి చెక్ డ్యామ్, వెల్టూర్ గోపాల సముద్రం చెరువును మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకుల సందర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... రైతు సంక్షేమం , సాగునీరు అందించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో చెక్ డ్యాముల నిర్మాణం, చెరువుల ఆధునీకరణ జరిగిందని వారు అన్నారు. చెక్ డ్యామ్ నిర్మాణం, చెరువుల ఆధునీకరణ వలన తెలంగాణలో సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. చెక్ డ్యాములు, చెరువుల నిర్మాణం వలన భూగర్భ జలాల నీటిమట్టం పెరగడంతో పంట అధిక దిగుబడి సాధించవచ్చని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముందు చూపుతో మండలంలోని చెక్ డ్యాములను, చెరువులను ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, వెల్టూర్ గ్రామ అధ్యక్షులు మలక్ సురేష్, చిత్తూరు కృష్ణారెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, సుద్ధ బాయ్ రాజు, అడివన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.





# సత్తుపల్లి సింగరేణిలో ఘనంగా పోచమ్మ బోనాలు

**సత్తుపల్లి, ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి సింగరేణి కాలనీలో సోమవారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం పోచమ్మ తల్లి అమ్మవారికి సింగరేణి కాలనీ కుటుంబ సభ్యులు, ఆడపడుచులు, సోదర సోదరీమణులు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలనీవాసులు మంగళ వాయిద్యాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి, పోతురాజుకు నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ముఖ్య అతిథులుగా సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్, ఏ.ఎం.సీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, నాయకులు దొడ్డ శ్రీనివాసరావు , సింగరేణి అధికారులు ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు, సింగరేణి యూనియన్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలనీలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, బోనాల పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు సహకరించిన కాలనీ కుటుంబ సభ్యులు, ఆడపడుచులందరికీ, ప్రజా ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు, యూనియన్ ప్రతినిధులకు, ఇతర ముఖ్య నాయకులకు పోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీత సతీష్ యాదవ్ కు ఘన సన్మానం

**వనపర్తి,ఆగస్టు19 ( తెలంగాణ ముచ్చట్లు):**



గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్, పాండి యూనివర్సిటీ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్ నేషనల్ పీస్ యూనివర్సిటీ వారిచే అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ కి పాండిచ్చేరిలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ కు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా మంగళవారం ఉదయం వారి నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, కాటేపాగ హుస్సేన్ , డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు, జనం పవర్ పత్రిక జిల్లా స్టాపర్ గంధం రవికుమార్, ఎం కురుమయ్య తెలుగు సత్తా పత్రిక మండల రిపోర్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంధం రవికుమార్ మాట్లాడుతూ

గత 25 సంవత్సరాలుగా సమాజ సేవ, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం, దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులకు ఈ గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేయగా, తెలంగాణ రాష్ట్రం నుంచి సామాజిక సేవ,ప్రజల శ్రేయస్సు విభాగంలో సతీష్ యాదవ్ ను ఎంపిక వనపర్తి జిల్లాకు గర్వించదగ్గ విషయం. మీకు లభించిన గౌరవానికి దోహదపడిన వనపర్తి పట్టణ, జిల్లా ప్రజానీకానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాలి. ఇది రాబోవు కాలంలో వనపర్తి జిల్లా ప్రజలకు మరింత సేవ చేయడానికి ఉపయోగ పడుతుంది అన్నారు.

## వెల్టూర్ చెరువును సందర్శించిన కాంగ్రెస్ నాయకులు డిఎస్ మహేష్

**పెద్దమందడి,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**



భారీ వర్షాలకు పెద్దమందడి మండలం వెల్టూర్ చెరువు పూర్తిస్థాయిలో నుండి అలుగు పారుతుండడంతో చెరువును కాంగ్రెస్ నాయకులు డిఎస్ మహేష్ సందర్శించారు. మంగళవారం చెరువును సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిఎస్ మహేష్ మాట్లాడుతూ... భారీ వర్షాలకు వెల్టూర్ గోపాల సముద్రం చెరువు నిండడంతో రైతులకు శుభ పరిణామమని అన్నారు. రైతులకు యాసంగి పంటకు సాగునీరు అందనుండడంతో... గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. యాసంగి పంటకు సిద్ధం కానీ రైతులు ఆందోళన చెందకుండా వెంటనే వ్యవసాయ పనులు ప్రారంభించుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భారీ వర్షాలు పట్ల ప్రజలు ప్రభుత్వం గా ఉండాలని డిఎస్ మహేష్ సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం-20- ఆగస్టు 2025





## సజీవ చరిత్రకు ప్రత్యక్ష్య సాక్ష్యం ఫోటో

- ఫోటోగ్రఫీ ఒక సృజనాత్మక కళ
- ఫోటో జర్నలిస్టులకు అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం శుభాకాంక్షలు
- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):

చరిత్రను సజీవంగా నిలిపే ప్రత్యక్ష సాక్ష్యం ఫోటో అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోటో జర్నలిస్ట్లతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కేక్ కట్ చేసి ఫోటో జర్నలిస్టులకు శుభాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కోటి అక్షరాలతో చెప్పలేని భావాన్ని,విషయాన్ని ఒక ఫోటో ద్వారా చెప్పవచ్చు అన్నారు.చరిత్రను నమోదు చేయడానికి మన సంస్కృతీ సంప్రదాయాలను ముందుతరాల వారికి తెలుపడానికి ఫోటోలు ఎంతగానో ఉపకరిస్తాయని వివరించారు. తరతరాల భావోద్వేగాలను,కథలను తెలియజేయడానికి ఫోటోగ్రఫీ ఒక శక్తి వంతమైన మాధ్యమమని చెప్పారు.గతకాలపు జ్ఞాపకాలను పదిలంగా అందించే ఫోటోలు తీపి గుర్తులుగా మిగిలి ఉంటాయని ఎస్పీ అన్నారు.ఫోటో జర్నలిజం నిజాన్ని కళ్లెదుట నిలిపే పదునైన ఆయుధం అని ఆయన అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో అన్ని పత్రికల ఫోటో జర్నలిస్టులు రాము, బాలరాజు, నవీన రమేష్, యూసుఫ్, యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్సింగ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాంత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి

- దుఃఖంలో కుటుంబ సభ్యులకు ఓదార్పు
- ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ
- కాంగ్రెస్ నేతలతో కలిసి పరామర్శ
- వ్యక్తిగత సహాయం అందిస్తానని భరోసా

ఉప్పల్,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్లో శ్రీకృష్ణాష్టమి శోభాయాత్రలో జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన శ్రీకాంత్ రెడ్డి కుటుంబాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆయనతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి, ఆకారపు అరుణ్, కంది శ్రవణ్ రెడ్డి, లుకాస్, సందీప్, భాస్కర్ తదితరులు కలిసి రామంతాపూర్ శారదా నగర్లోని అంజిరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వ్యక్తిగతంగా తాను ఎల్లప్పుడూ సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

# కార్మికుల మహాసభ-పరిష్కారం లేక నిరాశ

- సిద్దిపేట వేదికగా బలంగా వినిపించిన కూలీల డిమాండ్లు
- స్పందించని ప్రభుత్వం, హెచ్చరికలతో రోడ్డుమీదకు రావాలని సంకల్పం
- "మా శక్తి ఏంటో హైదరాబాద్లో చూపిస్తాం" – కార్మిక సంఘం

హన్మకొండ,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):




సిద్దిపేట వేదికగా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహార్యాలి అనంతరం మహాసభలో కార్మికుల గళం బలంగా వినిపించింది. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని పలుమార్లు ఆహ్వానించినప్పటికీ, ఆయన సభకు రాకపోవడం కూలీలలో తీవ్ర నిరాశ కలిగించింది. అనివార్య కారణాల వల్ల హాజరు కాలేదని తెలియజేసినప్పటికీ, ఇంత పెద్ద ఎత్తున మహాసభ జరిగిన సందర్భంలో మంత్రి గైర్హాజరు కావడం మాలో మనస్తాపం కలిగించిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రమ శక్తి అవార్డు గ్రహీత గిన్నారపు మహేందర్ తెలిపారు.

సభలో స్థానిక నేతలు కూలీల డిమాండ్లను సమర్థిస్తూ, వాటి పరిష్కారం కోసం రెండు మూడు రోజుల్లోనే కార్మిక మంత్రిని కలిసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే 21 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి ప్రకటన రాకపోవడం, ప్రభుత్వం నుంచి చర్యలు లేకపోవడం కూలీలను తీవ్రంగా నిరుత్సాహపరిచిందని మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రస్తుతం ఓపికగా ఉన్నాం. ఇకపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తే రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో రాస్తారోకోలు, ధర్నాలు చేయడానికీ వెనుకాడమని" హెచ్చరించారు.

"మా కార్మిక శక్తిని రాష్ట్ర ప్రభుత్వం తక్కువ అంచనా వేస్తోంది. కానీ అవసరమైతే మా శక్తి ఏంటో హైదరాబాద్ నడిబొడ్డునే చూపిస్తాం" అని ఆయన స్పష్టంచేశారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**

- 55 ఏళ్లు నిండిన ప్రతి కార్మికునికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- కార్మిక కార్డు శాశ్వత కాలం చెల్లుబాటు కావాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మికునికి 10 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలి.
- సహజ మరణం చెందిన కార్మికుని కుటుంబానికి 2 లక్షల ఆర్థిక సాయం అందించాలి.
- కార్మిక వెల్ఫేర్ బోర్డుకి కార్మికునినే చైర్మన్గా నియమించాలి.
- కార్మికుల అభివృద్ధి కోసం 10 లక్షల రుణ సౌకర్యం కల్పించాలి.

కార్మికులు చేసిన డిమాండ్లు సాధారణమైనవే కావడం, వాటి పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద సవాలు కాదని స్పష్టంగా చెబుతూ, వీటిని తక్షణమే పరిష్కరించాలని సంఘం విన్నవించింది.

# బలవంతపు మార్టిగేజ్తో దళిత దంపతుల ఇల్లు విక్రయం

- మార్వాడీలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ–ఎస్టీ కమిషన్ వద్ద విన్నపం
- జవహర్నగర్ పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- రాచకొండ పోలీస్ కమిషనర్కు కమిషన్ ఆదేశాలు

దమ్మాయిగూడ,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):

మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడకు చెందిన దళిత దంపతులు యాదగిరి, స్వరూపలు తమ ఇల్లు బలవంతంగా మార్టిగేజ్ చేయించి 50 లక్షలకు విక్రయించిన మార్వాడీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ కమిషన్ను ఆశ్రయించారు. బాధితులు కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, సభ్యులు కె.లక్ష్మీనారాయణలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆధ్వర్యంలో బాధితులు తమ వేదనను వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగి అయిన తాను అప్పు అవసరం లేదని చెప్పినా, మార్వాడీ వ్యాపారి రామ్ దేవ్ బాటియా తన రౌడీలను పంపి ఇల్లు సంబంధించిన పత్రాలను బలవంతంగా తీసుకెళ్లి మార్టిగేజ్ చేసి, అనంతరం 50 లక్షలకు విక్రయించాడని బాధితుడు యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు.



ఈ ఘటనపై జవహర్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపించారు.ఈ విన్నపంపై స్పందించిన ఎస్సీ-ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య రాచకొండ పోలీస్ కమిషనర్కు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


## చైనా విదేశాంగ మంత్రికి జైశంకర్ సూటి సందేశం



భారత్చైనా సంబంధాలు పునరుద్ధరించాలంటే నిజాయితీ అవసరమని జైశంకర్ స్పష్టం చేశారు. సంభాషణ, పరస్పర గౌరవం, ప్రయోజనాలపై బంధం ఉండాలన్నారు.చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్ వచ్చారు. ఆయనతో సోమవారం జైశంకర్ సమావేశమై విస్తృతంగా చర్చించారు.జైశంకర్ మాట్లాడుతూ, విభేదాలు వివాదాలు కాకూడదు. పోటీ సంఘర్షణకు దారితీయకూడదు అని పేర్కొన్నారు. స్పష్టమైన శాంతియుత మార్గమే అవసరమని అన్నారు.సరిహద్దుల్లో శాంతి ఉంటేనే సంబంధాలు మెరుగవుతాయని జైశంకర్ అన్నారు. బలగాల ఉపసంహరణ ప్రక్రియ వేగంగా సాగాలన్నారు. చర్చలు పటిష్టంగా జరగాలన్నారు. వాంగ్ యీ మాట్లాడుతూ, శాంతియుత పరిస్థితులు కొనసాగుతున్నాయి. మానస సరోవర్ యాత్రలకు అనుమతి ఇచ్చాం, అన్నారు. చర్చలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.వాంగ్ యీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి మోదీతో సమావేశం కానున్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్తో కూడా సమావేశమవుతారు.2020లో గల్వాన్ లోయ ఘటన తరువాత రెండు దేశాల మధ్య సంబంధాలు బాగా క్షీణించాయి. తూర్పు లడఖ్లో నాలుగేళ్లుగా సైనిక ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎల్ఏసీ వెంబడి పరిస్థితులపై చర్చలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శాంతిని లక్ష్యంగా పెట్టుకుని చర్చలు జరిగాయి. ప్రధాని మోదీ త్వరలో చైనా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ చర్చలు కీలకం. ఉద్రిక్తత తగ్గించేందుకు ఇది సానుకూల అడుగు అయ్యింది.ఇరు దేశాల మధ్య నమ్మకం పెరగాలి. మాట్లాడుకోవడం వల్లే పరిష్కారాలు కనపడతాయి. జైశంకర్ మాటల్లో ఆశ ఉంది.భారత్చైనా మధ్య సంబంధాలు క్లిష్టంగా ఉన్నాయి. అయినా, సంభాషణతో పరిష్కారాలకు దారులు తెరవచ్చు. శాంతి, పరస్పర గౌరవమే భవిష్యత్తు బంధానికి బలమవుతుంది.

# మధుర గాత్రానికి ప్రతిరూపం

తెలుగు సినీ సంగీతానికి ఒక నిత్య పుష్పంగా వికసించిన గాయకుడు విస్సంరాజు రామకృష్ణ దాసు, తెలుగు ప్రేక్షకులకు ''వి. రామకృష్ణ''గా సుపరిచితుడు. మధురమైన స్వరానికి, సున్నితమైన భావాలకు నూరిత గాత్రానికి ఆయన మారు పేరయ్యారు. మూడు దశాబ్దాలకు పైగా శ్రోతలను తీయటి పాటలతో అలరించి, వేలాది గాన మణులను తెలుగు సంగీత ఖజానాకు అందించారు. ఆయన గాత్రం చల్లని వానలో తడిచిన తొలి చినుకుల లా ఉండేది. ప్రతి పాటా ఓ ఆత్మీయ అనుభూతి, ఒక స్వర యాత్ర. 1947 ఆగస్టు 20న విజయ నగరం జిల్లాలో జన్మించిన రామకృష్ణ చిన్నతనం నుంచే సంగీతంపై అపారమైన మక్కువను పెంచుకున్నారు. శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకొని, ఆ శిక్షణను అనుభూతిగా మార్చిన అరుదైన గాయకుల్లో ఆయన ఒకరు. సంగీతాన్ని ఆత్మగా భావించిన ఆయన, కేవలం కళా ప్రదర్శనకే కాకుండా, భావ ప్రకటనకు సాధనంగా గానం చేశారు. 1960ల చివరలో సినీ రంగ ప్రవేశం చేసి, తక్కువ కాలంలోనే తన మృదువైన గాత్రంతో సంగీత దర్శకుల మన్ననలు పొందారు. కె.వి.మహదేవన్, రాజన్ నాగేంద్ర, చక్రవర్తి, కోటి వంటి దిగ్గజాలచే అవకాశం పొందిన రామకృష్ణ, అనేక హిట్ చిత్రాల్లో పాడి తెలుగు పాటల పటాన్ని ఆహ్లాద భరితంగా మలచారు. రామకృష్ణ గానం సౌందర్యాన్ని మాత్రమే కాదు, సాహిత్యపు సారాన్ని కూడా ప్రతిబింబించేది. ఆయన పాడిన ''చూపులేచి చినుకై తగిలే వేళ'' అనే పాటలో ప్రేమలోని సంశయాలను, అమాయకపు ఆకర్షణను ఎంతో మృదువుగా మలిచారు. ''ఓ ఊర్వశి కావ్యమూర్తి'' అనే పాటలో శృంగార రసానికి కవిత్వపు వర్ణనను గాత్రంలో ప్రతిబింబిస్తూ, శ్రోతలను మైమర పించారు. ''కలలే పలుకుతుంటే'' అనే పాటలో కలలలోనూ ఊహలలోనూ మాట్లాడే అనురాగాన్ని ఆయన గొంతు స్పష్టంగా పలికించింది. ''ఈ కాలమే ఈ పాత నవల'' పాటలో కాలప్రవాహాన్ని, భావ వికాసాన్ని, జీవిత పరిమళాన్ని గాన రూపంలో ఆవిష్కరించారు. ''నిన్ను చూసాక నాకేమైనా అయ్యింది'' అనే పాటలో ప్రేమ అనేది ఎప్పుడూ ఊహలకే పరిమిత మవుతుందో



అనే మనోభావాన్ని, ఎంతో అంతర్ముఖతతో వెలికి తీశారు. ఆయన ఆలపించిన పాటల్లో భావం, భాష, బంధం అన్నీ సమపాళ్లలో మిళితమై ఉండేవి. ఘంటసాల ప్రభావం ఉన్నా, ఆ ప్రభావాన్ని అధిగమించి, తనదైన గానశైలితో రామకృష్ణ వినూత్న ప్రతిభను చూపించారు. ఆయన గొంతులో ఉన్న మృదుత్వం, మధ్య శ్రుతిలోని మెలకువ, తక్కువ గమకాలతో ఎక్కువ భావాన్ని పలికించే శక్తి ఆయన గానానికి ప్రత్యేకతను కలిగించింది. ''చిత్రమైన భావాలు'' వంటి తక్కువగా ప్రసిద్ధి చెందిన పాటలు కూడా ఆయన గాత్రంలోని లోతును, తేజస్సును వెల్లడిరచాయి. భక్తి గీతాలలోనూ ఆయనకున్న పట్టు అసాధారణం. ''హర హర శంకర'', ''శివ శివ శివ భోజనానంద'' వంటి గీతాలు ఆధ్యాత్మికతను శ్రోత గుండెల్లో నాటే స్వరంగా మారాయి. రామకృష్ణ గాత్రంలో భక్తిరసం ఓ వేదగానంలా ప్రతిధ్వనించింది. గంభీరత, శాంతి, నిబద్ధతతో కూడిన స్వరం ఆలయ గర్భగుడిలో వినిపించే శాంతస్వరంలా ఉండేది. తాతామనవడు, భక్తతుకారాం, శారద, కృష్ణవేణి, అల్లూరి సీతారామరాజు, ముత్యాల ముగ్గు, అందాల రాముడు, భక్త కన్నప్ప, దాన వీర శూర కర్ణ, మహాకవి క్షేత్రయ్య, అమర దీపం, శ్రీమద్ విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, శ్రీషిర్డీ సాయిబాబా మహత్యం, బలిపీఠం, గుణవంతుడు, కరుణా మయుడు లాంటి చిత్రాల్లో ఆయన పాడిన పాటలు నిత్య జ్ఞాపకాలే. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, కృష్ణ, మురళీ మోహన్ లాంటి అగ్రతారల చిత్రాల్లో ఆయన గొంతు తమ పాత్రలకు జీవం పోసింది. ముఖ్యంగా శోభన్ బాబు పాత్రల పట్ల ఆయన గానం ఎంతో అనురాగాన్ని కలిగించేది. ఆ పాత్రల్లోని భావోద్వేగాలను ఆయన స్వరం ఆకర్షణీయంగా వెలికితీసింది. ''దేవుడే ఇచ్చాడు వీధి'', ''ఎంతటి రసికుడివో'', ''వసంత సమీర'' వంటి పాటలు ఆ పాత్రల ఆత్మను మనకు వినిపించినట్లు అనిపిస్తాయి. అతని పాటలు మాత్రమే కాదు, జీవిత ప్రవర్తన కూడా గంభీరంగా ఉండేది. మితభాషి, వినయ వంతుడు అయిన రామకృష్ణ తన గాన సాధనను విలాసంగా కాక, భక్తిగా కొనసాగించారు. అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నా, ఎప్పటికీ వినమ్రంగా ఉండటం ఆయన వ్యక్తిత్వ విశేషం.2015 జూలై 16న అనారోగ్యంతో ఈ గాన మధుర స్వరం మూగ బోయింది. కానీ ఆయన ఆలపించిన పాటలు తెలుగు సంగీత చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోయాయి. గళపరంగా ఆయన మన మధ్య లేకపోయినా, గాత్రంగా మాత్రం ప్రతీ మనసులో ఒక తీయని ఆలాపనగా వినిపిస్తూనే ఉంటారు. వి. రామకృష్ణ ఒక గాయకుడు మాత్రమే కాదు %% ఒక స్వరం. ఆ స్వరం మౌనంగా పలికిన భావాలకు శబ్దం ఇచ్చింది. ఆ గాత్రం తీయని అనుభూతికి రూపం ఇచ్చింది. తెలుగు గాన పరంపరలో ఆయన స్థానం శాశ్వతం. ఆయన పాటలు పల్లకిలో కూర్చుని, భావాల పయనంలో తీసుకెళ్లే లాంటి ప్రయాణం. ఆయన్ని మరచి పోవడం సాధ్యం కాదు ఎందుకంటే ఆయన గానం మనల్ని తడిపించిన వర్షం, మన హృదయాన్ని తాకిన తంతి.

## పర్యావరణ పరిరక్షణకు శక్తి విప్లవం

ప్రతి సంవత్సరం ఆగస్టు 20న దేశ వ్యాప్తంగా అక్షయ్ ఊర్జా దివస్ జరుపు కుంటారు. 2004లో మొదలైన ఈ దినోత్సవం, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన సాంకేతికాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ పునరుత్పాదక ఇంధనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేయ బడిరది. 'అక్షయ్' అనే పదానికి క్షీణించని, ఎప్పటికీ తరుగని అనే అర్థం ఉంది. అదే భావాన్ని ప్రతిబింబిస్తూ సౌర శక్తి, గాలి శక్తి, నీటి ప్రవాహ శక్తి, బయోమాస్, భూతాప శక్తి, సముద్ర తరంగాల శక్తి వంటి పునరుత్పాదక వనరులను వినియోగించడంపై ఈ రోజు దృష్టి కేంద్రీకరించ బడుతుంది. మనిషి నాగరికతలో శక్తి వనరుల ప్రాధాన్యం అపారమైంది. పారిశ్రామిక విప్లవం నుండి ఇప్పటివరకు బొగ్గు, చమురు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలే అభివృద్ధికి ఆధారం. కానీ వీటి నిల్వలు పరిమిత మవుతుండటంతో పాటు అధిక వినియోగం వలన గ్రీన్ హౌస్ వాయువులు పెరిగి భూమి ఉష్ణోగ్రతలు గత 150 సంవత్సరాల్లో సగటున 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి. యునైటెడ్ నేషన్స్ నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కార్బన్ ఉద్గారాలలో సుమారు 75% శాతం శిలాజ ఇంధనాల వినియోగం వల్లే ఉత్పత్తి అవుతున్నాయి. వాతావరణ మార్పులు, సముద్ర మట్టాల పెరుగుదల, హిమనదుల కరుగుదల, తుపానులు, వరదలు, కరువులు వంటి సమస్యలకు ఇది ప్రధాన కారణం. ఈ పరిస్థితుల్లో పునరుత్పాదక ఇంధనాలే భవిష్యత్తు కోసం సరైన మార్గం. భారత్ ఈ దిశగా గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. 2014లో దేశంలో పునరుత్పాదక శక్తి సామర్థ్యం 80 గిగావాట్లు మాత్రమే ఉండగా, 2025 నాటికి ఇది 180 గిగావాట్లకు పెరిగింది. ఇందులో 82 గిగావాట్లు సౌర శక్తి, 47 గిగావాట్లు గాలి శక్తి, మిగతావి జలవిద్యుత్, బయోమాస్ వనరులవే. అంతర్జాతీయ సౌర కూటమి ఏర్పాటులో భారత్ కీలకపాత్ర పోషించింది. ఇది 2015లో పారిస్ ఒప్పందం తరువాత భారత్-ఫ్రాన్స్ సంయుక్త ఆవిష్కరణ. ప్రస్తుతం 110కిపైగా దేశాలు సభ్యత్వం పొందాయి. గుజరాత్ లోని చరణకా సోలార్ పార్క్, రాజస్థాన్ లోని భద్లా సోలార్ పార్క్ వంటి ప్రాజెక్టులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. తమిళనాడు గాలి విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుండగా, ఆంధ్రప్రదేశ్,



తెలంగాణలో పెద్ద సౌర ప్రాజెక్టులు విజయవంతంగా నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బయోగ్యాస్ ప్లాంట్లు, సౌర దీపాలు, సౌర వంటిల్లు వాడకం పెరుగుతోంది. ప్రభుత్వం 'గ్రీన్ ఎనర్జీ కారిడార్స్' ద్వారా పునరుత్పాదక శక్తి ఉత్పత్తి కేంద్రాలను జాతీయ విద్యుత్ గ్రిడ్కు అనుసంధానం చేస్తోంది. అక్షయ్ ఊర్జా దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో సెమినార్లు, ప్రదర్శనలు, ర్యాలీలు, వర్క్షాప్లు నిర్వహించి విద్యార్థులు, యువతలో పునరుత్పాదక శక్తి ప్రాముఖ్యతను చాటి చెప్పతున్నారు. పునరుత్పాదక శక్తి వినియోగం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుని కర్తవ్యమని ఈ రోజుతో గుర్తుచేస్తారు. ఇళ్లలో సౌర ప్యానెల్లు అమర్చడం, విద్యుత్ పొదుపు పరికరాలు వాడటం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, అవసరమైనంత మాత్రమే విద్యుత్ వినియోగించడం వంటి చిన్నచిన్న చర్యలతోనే పెద్ద మార్పు సాధ్యమవుతుంది.భారతదేశం 2070 నాటికి నెట్ జీరో కార్బన్ ఉద్గారాలు సాధించాలనే సంకల్పాన్ని ప్రకటించింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో పునరుత్పాదక ఇంధనాలు కీలక పాత్ర పోషించ నున్నాయి. శక్తి రంగంలో ఈ మార్పు కేవలం పర్యావరణ పరిరక్షణకే కాకుండా, ఆర్థికంగా దేశానికి మేలు చేస్తుంది. పచ్చశక్తి రంగం 2030 నాటికి కోట్లాది ఉద్యోగాలను సృష్టించే అవకాశముందని నిపుణుల అంచనా. అందువల్ల అక్షయ్ ఊర్జా దివస్ కేవలం ఒక దినోత్సవం కాదు, భవిష్యత్తు పర్యావరణ పరిరక్షణకు ఇచ్చే హెచ్చరిక, సుస్థిర అభివృద్ధికి ఇచ్చే సంకేతం. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడం ద్వారా ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక పురోగతిని ఒకేసారి సాధించవచ్చు. ప్రతి పౌరుడు తమ స్థాయిలో సహకరిస్తే, భారత్ ప్రపంచానికి పచ్చశక్తి విప్లవంలో ఆదర్శంగా నిలుస్తుంది.

## భారీగా పెరిగిన యుపిఐ లావాదేవీలు




భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల పరంగా ఒక విప్లవమే సాగుతోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వినియోగం ప్రతి నెల కొత్త రికార్డులు సృష్టిస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక ప్రకారం, 2025 ఆగస్టు నాటికి యూపీఐ ద్వారా రోజువారీ లావాదేవీల విలువ రూ.90,446 కోట్లకు చేరుకుంది. ఇది గత నెలలతో పోలిస్తే గణనీయమైన వృద్ధిని చూపిస్తోంది.ఈ ఏడాది జనవరిలో రోజువారీ సగటు విలువ రూ.75,743 కోట్లు ఉండగా, జూలై నాటికి అది రూ.80,919 కోట్లకు చేరింది. ఇక ఆగస్టులో ఈ సంఖ్య మరింత పెరిగింది. ఇది యూపీఐపై వినియోగదారుల నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది. విలువ మాత్రమే కాదు, యూపీఐ లావాదేవీల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. జనవరిలో ఉన్న సంఖ్యతో పోలిస్తే ఆగస్టులో 127 మిలియన్లు పెరిగి, మొత్తం 675 మిలియన్లకు చేరింది. ఈ గణాంకాలు యూపీఐకి ఉన్న ఆదరణను చూపిస్తున్నాయి.ఒక కప్పు కాఫీ కొనుగోలుకైనా, లక్షల్లో డబ్బు బదిలీకి అయినా.. యూపీఐ అన్ని అవసరాలకు మార్గం చూపుతోంది. ఇది సౌలభ్యంతో పాటు, వేగంగా చెల్లింపులు జరిగేలా చేస్తోంది.యూపీఐ లావాదేవీలను నిర్వహించే బ్యాంకుల విషయానికొస్తే, ఎస్‌బీఐ అగ్రస్థానంలో నిలిచింది. మొత్తంగా 5.2 బిలియన్ల లావాదేవీలు నిర్వహించి, టాప్ రెమిటర్‌గా నిలిచింది. ఇది బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ ప్రభావాన్ని మళ్ళీ రుజువు చేస్తోంది. యూపీఐ వృద్ధి చూస్తే, దేశం పూర్తిగా డిజిటల్ చెల్లింపుల వైపు దూసుకెళ్తున్నట్టు తెలుస్తోంది. నగదు లేని లావాదేవీలు నిత్యజీవితంలో భాగమవుతున్నాయి. చిన్న వ్యాపారులు, యువత, ఉద్యోగులు అందరూ యూపీఐని ఆనందంగా స్వీకరిస్తున్నారు.ఈ పెరుగుతున్న వృద్ధి చూస్తే, 2026 నాటికి యూపీఐ వాడకం ఇంకాస్త పెరిగే అవకాశం ఉంది. టెక్నాలజీ మరింత ముందుకు వెళ్తే, యూపీఐలో కూడా కొత్త ఫీచర్లు రావొచ్చు. భద్రత, వేగం, సౌలభ్యం వంటి అంశాలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

# తయారీకి అధిక టారిఫ్‌ల ముప్పు



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు భారత తయారీ రంగానికి ముప్పుగా మారాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు దేశ ఎగుమతి రంగాన్ని సంక్షోభంలోకి నెట్టనున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్న తరహా వ్యాపారాలు తీవ్ర సవాళ్లను ఎదుర్కోనున్నాయి. అధిక టారిఫ్‌లతో మేక్ ఇన్ ఇండియా ద్వారా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చాలనే కేంద్ర లక్ష్యం నీరుగారనుందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. యూఎస్ చర్యలు తయారీకి పెద్ద ఎదురుదెబ్బగా మారనున్నాయని హెచ్చరికలు వస్తోన్నాయి. అధిక టారిఫ్‌లు ముఖ్యంగా దేశంలోని వస్త్ర రంగంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని, అమెరికాకు ఎగుమతి చేస్తోన్న సుమారు 4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.35వేల కోట్లు) విలువైన దుస్తులు ప్రమాదంలో పడ్డాయని అప్పారెల్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఎగుమతుల ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) సెక్రెటరీ జనరల్ మిథిలేశ్వర్ ఠాకూర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'అమెరికా గతంలో విధించిన 25 శాతం టారిఫ్‌కు అదనంగా 25 శాతం అదనపు సుంకాలను మోపింది. దీనివల్ల భారత దుస్తుల ఎగుమతులు అమెరికా మార్కెట్‌లో పోటీతత్వాన్ని కోల్పోతాయి. అమెరికాకు దుస్తుల ఎగుమతుల్లో భారత్ 33 శాతం వాటాను కలిగి ఉంది. టెక్స్‌టైల్ రంగానికి యూఎస్ అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటి. ఈ టారిఫ్‌ల వల్ల 80 శాతం సాధారణ దుస్తుల ఉత్పత్తులు దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువ చేస్తాయి. టారిఫ్‌లతో ఇవి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. సుంకాల పెరుగుదల ఎగుమతిదారులను భారీ ఆర్థిక ఒత్తిడికి గురి చేస్తాయి. ఫలితంగా ఆర్డర్‌లు రద్దు, ఆలస్యం, ఆర్థిక నష్టాలు ఎదురవుతున్నాయి.'' అని ఠాకూర్ పేర్కొన్నారు. ఎఇపిసి వివరణ ప్రకారం.. భారత్‌పై అమెరికా మోపిన అధిక టారిఫ్‌ల వల్ల కనీసం బంగ్లాదేశ్, వియత్నాం లాంటి చిన్న దేశల ఉత్పత్తులతో పోటీ పడలేని పరిస్థితి నెలకొంది. ఈ టారిఫ్‌ల వల్ల భారత ఎగుమతిదారులు 56 శాతం పోటీ నష్టాన్ని ఎదుర్కోనున్నారని అంచనా. అమెరికన్ కొనుగోలుదారులు ఆర్డర్‌లను నిలిపివేస్తున్నారు, మరోవైపు ఇతర దేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల భారత ఎగుమతిదారులు ధరలను తగ్గించి నష్టాలతో విక్రయించవలసి వస్తోంది. ఈ పరిస్థితి చిన్న తరహా వ్యాపారాలకు ఉపాధి నష్టాలు, ఫ్యాక్టరీ మూసివేతలు మరియు ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చని ఏఈపీసీ హెచ్చరించింది.

# కేంద్రం సంచలన నిర్ణయం..!






భారతదేశంలో ఎసి అమ్మకాలు ఇప్పటికీ చాలా తక్కువగా ఉందని, ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే కేవలం 910 శాతం మాత్రమే ఉందని గోద్రేజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది అన్నారు. తక్కువ జీఎస్టీ వల్ల ఏసీలు మరింత సరసమైనవిగా మారతాయి. జీఎస్టీ వ్యవస్థలో సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 28 శాతం జిఎస్‌టి స్లాబ్ నుండి ఎయిర్ కండిషనర్లు తొలగించి 18 శాతం జిఎస్‌టి స్లాబ్‌లోకి తీసుకురావాలని ప్రతిపాదించింది. ప్రభుత్వ ఈ ప్రతిపాదనతో గృహోపకరణాలను తయారు చేసే కంపెనీలు రాబోయే పండుగల సమయంలో మంచి అమ్మకాలను ఆశిస్తున్నాయి. జీఎస్టీ సంస్కరణ అమలు తర్వాత వివిధ మోడళ్లను బట్టి ఏసీల ధరలు రూ.1500 నుండి రూ.2500 వరకు తగ్గుతాయి. ప్రభుత్వం ఇటీవల ఆదాయపు పన్నును తగ్గించడం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును సవరించిన తర్వాత ధరలలో ఈ తగ్గింపు జరగబోతోంది. ఈ నిర్ణయం తర్వాత ఏసీలకు ప్రాముఖ్యత పెంచడమే కాకుండా 'ప్రీమియం ఎసి'లకు డిమాండ్‌ను పెరుగుతుంది. ఇక్కడ ప్రజలు ఖర్చు ప్రయోజనాల కారణంగా తక్కువ విద్యుత్తును వినియోగించే మోడళ్లను కొనుగోలు చేస్తారు. దీనితో పాటు 32 అంగుళాల కంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న టీవీలపై జీఎస్టీ స్లాబ్‌ను ప్రస్తుత 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించడంలో టీవీలు చౌకగా మారనున్నాయి. దీనిని గొప్ప నిర్ణయంగా అభివర్ణిస్తూ.. బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి. త్యాగరాజన్ ప్రభుత్వం ఈ మార్పులను త్వరగా అమలు చేయాలని కోరారు. ఎందుకంటే ప్రజలు ఇప్పుడు రూమ్ ఎయిర్ కండిషనర్లు కొనుగోలు చేసే ముందు నిర్ణయం అమలు కోసం వేచి చూస్తున్నారు. ఇప్పుడు ఆగస్టులో ఎవరూ ఎసి కొనరు, వారు సెప్టెంబర్ లేదా అక్టోబర్ 1 వరకు వేచి ఉంటారని త్యాగరాజన్ అన్నారు. పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా చైర్మన్ మనీష్ శర్మ మాట్లాడుతూ.. ఇంధన సామర్థ్యం గల ఉత్పత్తులపై పరిశ్రమ దాదాపు 12 శాతం జీఎస్టీ, మిగిలిన ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే ఏసీలు, ఇతర ఉపకరణాలపై జిఎస్‌టి ని 28 నుండి 18 శాతానికి తగ్గించిన పరిస్థితిలో మార్కెట్‌లో ధరలు నేరుగా 67 శాతం తగ్గుతాయి. ఎందుకంటే సాధారణంగా జీఎస్టీ బేస్ ధరపై విధించనున్నారు. అందుకే ఇది అపూర్వమైనది అని ఆయన అన్నారు. దీని వలన మోడల్‌ను బట్టి తుది వినియోగదారునికి ఎసి ధర రూ.1,500 నుండి రూ.2,500 వరకు తగ్గుతుందని శర్మ అన్నారు. అదేవిధంగా భారతదేశంలో ఎసిఅమ్మకాలు ఇప్పటికీ చాలా తక్కువగా ఉందని, ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే కేవలం 910 శాతం మాత్రమే ఉందని గోద్రేజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది అన్నారు. తక్కువ జీఎస్టీ వల్ల ఏసీలు మరింత సరసమైనవిగా మారతాయి. అనేక కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. సూపర్ ప్లాస్ట్రోనిక్స్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా మాట్లాడుతూ.. 32 అంగుళాల కంటే పెద్ద స్మార్ట్ టీవీలపై జీఎస్టీ తగ్గించడం వల్ల అమ్మకాలు 20 శాతం పెరుగుతాయని అన్నారు.




## గృహ రుణాలపై ఎస్బీఐ బాదుడు

దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) గృహ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే నూతన రుణ గ్రహీతలపై మాత్రమే 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) పెంచుతున్నట్లు శనివారం వెల్లడిరచింది. సవరించిన వడ్డీరేట్లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చినట్టు వెల్లడిరచింది. ముఖ్యంగా సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న ఖాతాదారులపై ఇది ఎక్కువ ప్రభావం చూపనుందని తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా వడ్డీ రేట్లను పెంచింది. ఇతర బ్యాంక్‌లు కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకొవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాల వ్యవధిని బట్టి ఉండనుంది. ఇప్పటివరకు ఎస్బీఐ గృహ రుణ రేట్లు 7.50 శాతం నుంచి 8.45శాతంగా ఉండగా.. తాజా పెంపునతో ఇది 7.50శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. సిబిల్ స్కోరు తక్కువగా ఉండేవారికి ఇకపై అధిక వడ్డీ రేట్లను చెలించాల్సి ఉంటుంది.''సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండిరగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచాం. ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమే. ఇప్పటికే తీసుకున్న గృహరుణాలకు ఇది వర్తించదు'' అని ఎస్బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. యూనియన్ బ్యాంక్ రుణ రేట్లు గతంలో 7.35శాతం ప్రారంభం కాగా.. ఇప్పుడు దాన్ని 10 బేసిస్ పాయింట్లు పెంచి 7.45 శాతానికి చేర్చింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 5.5 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను పెంచడం ఆర్థిక వ్యవస్థలో బలహీనత సంకేతాలను స్పష్టం చేస్తోన్నాయి.

## ఎక్స్‌షోరూమ్ ఆన్‌రోడ్ ధర మధ్య తేడా ఏమిటి?



రోడ్డు పన్ను, బీమా మొదలైన ఇతర అవసరమైన ఖర్చులను కారు ఎక్స్‌షోరూమ్ ధరకు జోడిరచినప్పుడు దానిని ఆన్‌రోడ్ ధర అంటారు. ఇందులో రోడ్డు పన్ను, బీమా, కారు ఉపకరణాల ధర ఉంటాయి. మీరు కారు కొనబోతున్నట్లయితే మీరు రెండు విషయాల గురించి విని ఉంటారు. ఒకటి కారు ఎక్స్‌షోరూమ్ ధర, మరొకటి కారు ఆన్‌రోడ్ ధర. కానీ రెండిరటి మధ్య తేడా ఉంటుంది. ఎక్స్‌షోరూమ్ ధర, ఆన్‌రోడ్ ధర మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉంది. కారు ఉన్నవారికి దీని గురించి తెలుసు. కానీ కారు లేనివారికి తెలియదు. కొందరు కారు లేకున్న దీని గురించి తెలిసే ఉంటుంది. ఒక కంపెనీ తన కొత్త కారును ప్రారంభించినప్పుడు అది కారు ఎక్స్‌షోరూమ్ ధరను నిర్ణయిస్తుంది. ఇది కారు అసలు ధర కాదు. ఎక్స్‌షోరూమ్ ధర అంటే కారుకు సంబంధించిన ఇతర ఖర్చులను కలిగి ఉన్న ధర. ఇది కారు ధర మాత్రమే అని చెప్పవచ్చు. కానీ ఇతర అవసరమైన ఖర్చులను ఎక్స్‌షోరూమ్ ధరకు జోడిరచినప్పుడు ఆన్‌రోడ్ ధర ఏర్పడుతుంది. రోడ్డు పన్ను, బీమా మొదలైన ఇతర అవసరమైన ఖర్చులను కారు ఎక్స్‌షోరూమ్ ధరకు జోడిరచినప్పుడు దానిని ఆన్‌రోడ్ ధర అంటారు. ఇందులో రోడ్డు పన్ను, బీమా, కారు ఉపకరణాల ధర ఉంటాయి. కస్టమర్ చేసిన పూర్తి, చివరి చెల్లింపును ఆన్‌రోడ్ ధర అని చెప్పవచ్చు. మీరు అత్యధికంగా అమ్ముడవుతున్న కార్లలో ఒకటైన మారుతి సుజుకి స్విఫ్ట్ కొనడానికి వెళ్లి దాని బేస్ మోడల్ ాశఅని కొనుగోలు చేశారని అనుకుందాం. ఈ మోడల్ ఎక్స్‌షోరూమ్ ధర రూ. 6,49,000. ఇందులో మీరు రోడ్డు పన్నుగా రూ. 60,510, బీమా కోసం రూ. 31,200 చెల్లించాలి. దీనితో పాటు కారు ఎక్స్‌ట్రా ఫిటింగ్ సహా ఇతర చిన్న ఖర్చులకు మీరు కొంచెం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మీరు కొనాలనుకుంటున్న వస్తువుల ధరను ఉపకరణాలు కవర్ చేస్తాయి. దీని తర్వాత మీరు కారుకు పూర్తి, తుది చెల్లింపును రూ. 7,41,510 చెల్లించాలి. ఇది కారు ఆన్‌రోడ్ ధర. ఈ ధరను ఉదాహరణగా పేర్కొన్నాము. ప్రతి కారు ఆన్‌రోడ్ ధర రాష్ట్రం, నగరాన్ని బట్టి మారవచ్చు. మీరు మీ రాష్ట్రం, నగరానికి ఆన్‌రోడ్ ధరను తనిఖీ చేయాలి.

## ఎల్ఐసీ పాలసీదారులకు సువర్ణావకాశం..!

వైద్య, ఆరోగ్య అవసరాలపై ఎటువంటి రాయితీ ఉండదని కంపెనీ తన ప్రకటనలో తెలిపింది. ప్రీమియం చెల్లింపు కాలంలో గడువు ముగిసిన, పాలసీ వ్యవధి పూర్తి కాని పాలసీలను ఈ ప్రచారంలో తిరిగి ప్రారంభించవచ్చు.దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఒక పెద్ద ప్రకటన చేసింది. ప్రభుత్వ రంగ ఎల్ఐసి నిలిపివేసిన వ్యక్తిగత బీమా పాలసీని తిరిగి ప్రారంభించాలని ఒక ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఈ ప్రత్యేక ప్రచారం ఒక నెల పాటు నిర్వహించనుంది. నిలిపివేసిన బీమా పాలసీని తిరిగి ప్రారంభించాలని కోరుతూ ఆగస్టు 18న ఓ ప్రచారాన్ని ప్రారంభించింది ఎల్ఐసీ. ఈ ప్రచార కార్యక్రమం 2025 సెప్టెంబర్ 17 వరకు కొనసాగుతుంది. దీని పాలసీని తిరిగి ప్రారంభించడానికి ఆలస్య రుసుములో ఆకర్షణీయమైన డిస్కౌంట్లు అందించనుంది. ఈ పథకం కింద అన్ని నాన్‌లింక్డ్ అంటే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ పథకాలకు ఆలస్య రుసుములపై 30 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు ఎల్ఐసి ఒక ప్రకటనలో తెలిపింది. పునరుద్ధరణకు అర్హత ఉంటే గరిష్టంగా రూ. 5000 వరకు ఉంటుంది. అదే సమయంలో మైక్రో ఇన్సూరెన్స్ పాలసీ (తక్కువ ఆదాయ కుటుంబం లేదా వ్యక్తికి బీమా పాలసీ) కోసం ఆలస్య రుసుములపై 100 శాతం తగ్గింపు ఇస్తున్నారు. ఈ ప్రత్యేక పునరుద్ధరణ ప్రచారం కింద పాలసీ నిబంధనలు, షరతులు నెరవేరితే మొదటి చెల్లించని ప్రీమియం తేదీ నుండి 5 సంవత్సరాలలోపు పాలసీని ప్రారంభించవచ్చు.





## ఉక్రెయిన్ భద్రతకు పుతిన్ అంగీకారం

ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం కనిపిస్తోంది. శాంతి ఒప్పందానికి మార్గం అవుతుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తొలిసారిగా ఓ కీలక అంగీకారానికి వచ్చినట్టు తెలిసింది.వైట్‌హౌస్‌లో సోమవారం జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో పాటు యూరోపియన్ దేశాధినేతలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, పుతిన్ ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు, అని చెప్పారు. ఇది శాంతికి ఒక గొప్ప ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ ఒప్పందంలో యూరోపియన్ దేశాల పాత్ర చాలా ముఖ్యమైందని ట్రంప్ వివరించారు. భద్రత విషయంలో ఎక్కువ బాధ్యత యూరప్ తీసుకుంటుందని చెప్పారు. మేము సహాయం చేస్తాం. కానీ ప్రధాన భాధ్యత వాళ్లదే, అన్నారు.ఈ భద్రతా ఒప్పందం ద్వారా ఉక్రెయిన్‌పై ఇక దాడులే జరగవని ట్రంప్ నమ్మకం వ్యక్తం చేశారు. జెలెన్‌స్కీ కూడా ఈ విషయంపై ఆశాభావం వ్యక్తం చేశారు. తమ దేశానికి శక్తివంతమైన రక్షణ అవసరమని, అమెరికా మద్దతు కీలకమని చెప్పారు. శాంతి ఒప్పందంలో భాగంగా ప్రస్తుత సరిహద్దులను పరిగణలోకి తీసుకుంటూ భూభాగాల మార్పులపై చర్చ జరుగుతుందని ట్రంప్ సూచించారు. అయితే, ఇది ఇంకా ప్రారంభ దశలోనే ఉందని తెలుస్తోంది. ట్రంప్ మాట్లాడుతూ, అవసరమైతే తాను పుతిన్, జెలెన్‌స్కీలతో కలిసి త్రైపాక్షిక సమావేశానికి సిద్ధమని ప్రకటించారు. ఇది శాంతి ప్రక్రియలో మరో కీలక అడుగు కావచ్చు.గత సమావేశంతో పోలిస్తే, ఈసారి వైట్‌హౌస్ వాతావరణం ఎంతో స్నేహపూర్వకంగా కనిపించింది. మునుపు మిలిటరీ దుస్తుల్లో కనిపించిన జెలెన్‌స్కీ, ఈసారి ఫార్మల్ సూట్‌లో వచ్చారు. ఈ స్టైల్ మార్పుపై ట్రంప్ కూడా సరదాగా స్పందించారు.ఈ భేటీలో నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, ఫిన్లాండ్ నేతలు పాల్గొన్నారు.

# నైజీరియాలో పడవ బోల్తా..

నైజీరియాలోని వాయువ్య సోకోటో రాష్ట్రంలోని స్థానిక గోరోన్యో మార్కెట్కు వెళ్తున్న ఓ పడవ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 40 మంది గల్లంతు అయ్యారు. ప్రమాదసమయంలో పడవలో 50మంది ఉన్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. కాగా 10మందిని ప్రాణాలతో రక్షించినట్లు జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది. అధికారులు గల్లంతు అయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రాణాలతో బయటపడ్డవారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఇటీవల తరచుగా నైజీరియాలో పడవ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దేశంలో కరువు, అంతర్గత పోరాటాల కారణంగా చాలామంది అక్రమంగా పొరుగుదేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ప్రమాదకరమైన చిన్న పడవలలో ప్రయాణిస్తూ, మత్యువాత పడుతున్నారు. పడవ యజమానులు సైతం డబ్బు ఆశతో సామర్థ్యానికి మించిన ప్రయాణికులను తీసుకెళ్తూ, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి, ఇలాంటి ప్రమాదలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



# పాకిస్తాన్ లో వరదల విధ్వంసం..




పాకిస్తాన్ అంతటా కురిసిన భారీ వర్షాలుఆకస్మిక వరదలకు దారితీశాయి. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ తీవ్రంగా దెబ్బతింది. ఇక్కడ పలు గ్రామాలు పూర్తిగా వరద ముంపులో కొట్టుకుపోయాయి. వాహనాలు, ఇళ్లు, దుకాణాలు ఒక్కసారిగా జలప్రవాహంలో కొట్టుకుపోవడంతో అక్కడి ప్రజలు ఆందోళనలో మునిగిపోయారు. పాకిస్తాన్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విడుదల చేసిన వివరాల ప్రకారం, జూన్ 26 నుంచి ఇప్పటివరకు సుమారు 657 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది పిల్లలు కూడా ఉన్నారు. అదేవిధంగా 929 మందికి పైగా గాయపడ్డారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరదల వల్ల అత్యంత దారుణంగా ప్రభావితమైన జిల్లాల్లో బునెర్ జిల్లా ఒకటి. ముఖ్యంగా బషోని గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఇక్కడ ఒకే కుటుంబానికి చెందిన 25 మంది మరణించడం విషాదాన్ని మరింత పెంచింది. శిథిలాల కింద చిక్కుకున్న వారికి బతికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని రెస్క్యూ బృందాలు చెబుతున్నాయి. ప్రభుత్వం, రెస్క్యూ బృందాలు ప్రభావితులను రక్షించడానికి, వారికి ఆహారం, నీరు అందించడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే రోడ్లు దెబ్బతినడం, మౌలిక సదుపాయాలు ధ్వంసం కావడం వల్ల సహాయక చర్యలు చాలా నెమ్మదిగా సాగుతున్నాయి. పలుచోట్ల సహాయక బృందాలు చేరడమే కష్టమవుతోంది.

## అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక

ఇరాన్ మరోసారి హెచ్చరికలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఎప్పుడు అయినా యుద్ధం జరిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది.ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీకి అత్యంత సన్నిహితుడైన యాహ్యా రహీమ్ సఫావీ తాజా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.'మేము శాంతి ఒప్పందాల్లో లేము. యుద్ధానికి సిద్ధమవుతున్నాం' అని సఫావీ వెల్లడిరచారు. అమెరికా, ఇజ్రాయెల్‌లతో ఎలాంటి ఒప్పందాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు యుద్ధమొకటి జరగొచ్చు. దానితోనే అంతం కావచ్చు' అని ఆయన హెచ్చరించారు.ఇరాన్ స్వయం బలం పెంపుపై దృష్టి పెడుతోంది. క్షిపణులు, డ్రోన్లు, సైబర్ యుద్ధం, మీడియా ప్రభావం వంటి రంగాల్లో తన శక్తిని పెంచాలని తలంపు. మేము కఠినమైన పరిస్థితులకు సిద్ధంగా ఉన్నాం,' అని సఫావీ స్పష్టం చేశారు. జూన్‌లో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు టెహ్రాన్ సమీపంలో ఉన్న ఐఆర్‌జీసీ కమాండ్ సెంటర్లపై దాడి చేశాయి. ఈ దాడులతో ఇరాన్ అణు, క్షిపణి కార్యక్రమాలకు నష్టం జరిగిందని ఇజ్రాయెల్ ప్రకటించింది.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఈ దాడులు యుద్ధానికి కారణం కాదన్నారు. కానీ, అణు ఆయుధ ముప్పును తొలగించేందుకే ఈ చర్యలు తీసుకున్నామని వెల్లడిరచారు. ఇది రక్షణ ఆపరేషన్ అని వ్యాఖ్యానించారు.జూన్‌లో అమెరికా 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో కీలక దాడులు చేసింది. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లలోని అణు కేంద్రాలు లక్ష్యంగా మారాయి. పెంటగాన్ ఈ దాడులను అధికారికంగా ధృవీకరించింది.

# రష్యా నుంచి భారత్ చమురు కొనొద్దు

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా తన హెచ్చరికలను కొనసాగిస్తోంది. మాస్కో నుంచి ఇండియా ముడి చమురు కొనుగోళ్లను ఆపాలని అమెరికా సలహాదారు నవారో అన్నారు. ఉక్రెయిన్‌తో మాస్కో యుద్ధానికి భారత చమురు నిధులు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని.. వీటిని తక్షణం ఆపాలని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో పేర్కొన్నారు. న్యూఢల్లీ ఇప్పుడు రష్యా, చైనాతో సన్నిహితంగా ఉంటోందని పేర్కొన్నారు. అమెరికా వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ పరిగణించబడాలనుకుంటే.. రష్యా, చైనాలతో వ్యాపార సంబంధాలను తగ్గించుకోవాలని పరోక్షంగా పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నందుకే తమకు లక్ష్యంగా మారిందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తున్నందుకు భారతీయ వస్తువులపై అదనంగా 25 శాతం టారిఫ్‌లను విధిస్తూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో భారత్‌పై సుంకాల మొత్తం 50 శాతానికి చేరుతుంది. ''రష్యా చమురును భారత్ కొనుగోలు చేయడం ద్వారా మాస్కోకు అవసరమైన డాలర్లను అందిస్తోంది. రష్యా, చైనాతో భారత్ సన్నిహిత సంబంధాలు నెరవేర్చితే అమెరికాకు చెందిన అత్యాధునిక సైనిక సామర్థ్యాలను ఇండియాకు బదిలీ చేయడం ప్రమాదకరమని భావిస్తున్నాము.'' అని నవారో పేర్కొన్నారు.





## ఖార్కివ్ పై డ్రోన్ దాడి పలువురు మృతి

రష్యాఉక్రెయిన్ యుద్ధం రోజుకో కొత్త విషాదాన్ని మిగులుస్తోంది. శాంతి చర్చలు కొనసాగుతూనే ఉన్నా, యుద్ధ రంగంలో దాడులు ఆగడం లేదు.తాజాగా ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరం మరోసారి భయానక దాడికి గురైంది. ఓ ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌పై రష్యా డ్రోన్ దాడి జరగడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడాది వయసున్న పసికందు కూడా ఉండటం కలచివేసింది.ఈ దాడిలో మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు ఉక్రైన్ అధికారులు తెలిపారు. సహాయక బృందాలు తక్షణమే స్పందించాయి. శిథిలాల మధ్య చిక్కుకున్న ఇద్దరిని సురక్షితంగా రక్షించగలిగారు.ఈ దాడికి కొన్ని గంటల ముందు కూడా ఖార్కివ్ భయపెట్టింది. రష్యా ఆ ప్రాంతంపై క్షిపణులతో దాడి చేసింది. ఈ ఘటనలో 13 ఏళ్ల బాలుడితో పాటు మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు. ఇక రష్యాలో కూడా పరిస్థితి నిలకడగా లేదు. గత శుక్రవారం ఉక్రెయిన్ డ్రోన్ దాడి కుర్స్క్ నగరాన్ని చిదిమేసింది. రైల్వే సమీపంలో ఓ భవనం టార్గెట్ చేయడం వల్ల పై నాలుగు అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. దాడిలో ఒకరు మృతి చెందారు. మరో 10 మంది గాయపడ్డారు.ఈ నేపథ్యంలోనే, ఆగస్టు 15న అమెరికాలోని అలస్కాలో ఓ కీలక సమావేశం జరిగింది. అ??కా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మూడు గంటల పాటు చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారమే ప్రధానంగా చర్చకు వచ్చింది. ఈ భేటీ అనంతరం ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ సరిపోదని, ప్రత్యక్షంగా ఇరు దేశాలు ఒప్పందానికి వచ్చితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. దౌత్య పరంగా చర్చల ద్వారా వేలాది ప్రాణాలను రక్షించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి దాడి వెనక ఒక కుటుంబం విచ్ఛిన్నమవుతోంది. చిన్నారులు, మహిళలు, నిరుపేదలు ఈ యుద్ధానికి బలైపోతున్నారు.



## సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన ప్రధాని మోదీ

మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్, న్యూఢల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని సోషల్ మీడియా వేదికగా స్పందించారు.సీపీ రాధాకృష్ణన్ గారిని కలిశాను. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన అనుభవం దేశానికి ఉపయోగపడుతుంది. అదే అంకితభావంతో కొనసాగుతారని నమ్మకముంది, అని మోదీ పేర్కొన్నారు. రాధాకృష్ణన్ కూడా ఈ భేటీపై స్పందిస్తూ, ప్రధాని మోదీని కలవడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఎన్డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్ ఎంపికను స్వాగతించారు.ఇది మంచి నిర్ణయం. జేడీయూ పూర్తి మద్దతు ఇస్తుంది, అంటూ నితీశ్ కుమార్ స్పష్టం చేశారు.జేడీయూకు లోక్‌సభలో 12, రాజ్యసభలో 4 స్థానాలు ఉన్నాయి. ఈ మద్దతు ఎన్డీఏకు కీలకంగా మారుతుంది.రాజకీయ సమీకరణాలపై బీజేపీ పూర్తి స్థాయిలో దృష్టిపెట్టింది. ఇతర పార్టీల మద్దతు కోసం చర్యలు మొదలయ్యాయి. ఈ బాధ్యతను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేపట్టారు. తమిళనాడు సీఎం స్టాలిన్, వైఎస్ జగన్‌లతో రాజ్‌నాథ్ ఫోన్‌లో మాట్లాడారు. ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు రాష్ట్ర పార్టీ మద్దతు దొరకడం గెలుపు అవకాశాలను పెంచుతుంది. ఇందాకా ఎన్డీఏ అభ్యర్థిపై దృష్టి కేంద్రీకృతమైంది కానీ, నేడు ఇండియా కూటమి నుంచి కూడా అభ్యర్థిని ప్రకటించనున్నారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని వెల్లడిరచారు.భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుగుతున్నాయి. సోమవారం అభ్యర్థిని ప్రకటిస్తాం, అని ఆయన తెలిపారు.67 ఏళ్ల సీపీ రాధాకృష్ణన్ రాజకీయంగా అనుభవజ్ఞుడు. కోయంబత్తూరు నుంచి రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో బలమైన అనుబంధం ఉంది. ఓబీసీ వర్గానికి చెందిన ఆయన, పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని గెలుచుకున్నారు. ఇప్పటికే బలంగా ఉన్న ఎన్డీఏ, మిత్రపక్షాల మద్దతుతో మరింత మెరుగైన స్థితిలోకి వస్తోంది. అయితే ఇండియా కూటమి అభ్యర్థి ఎవరు? ఎంత మేర మద్దతు సంపాదించగలరు? అన్నది వేచి చూడాల్సిందే.

## మోదీని కలిసిన శుభాంశు శుక్లా



భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి తిరిగి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. తన అంతరిక్ష ప్రయాణ అనుభవాలను, విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. శుక్లా ఇటీవల Iూూ ను సందర్శించి చారిత్రక ఘనత సాధించారు. ఈ సందర్భంగా మోదీ ఆయనను ఆప్యాయంగా హత్తుకుని, సరదాగా ముచ్చటించారు. శుభాంశు శుక్లా తన యాత్రలో ఎదురైన అనుభవాలను, అంతరిక్షంలో గడిపిన సమయాన్ని, శాస్త్రీయ పరిశోధనల వివరాలను ప్రధానికి వివరించారు. అంతరిక్ష రంగంలో భారతదేశం సాధిస్తున్న పురోగతి గురించి కూడా చర్చించినట్లు తెలుస్తోంది. అంతరిక్ష పరిశోధనలో భారత్ భవిష్యత్తు ప్రణాళికల గురించి కూడా ఈ సమావేశంలో ప్రస్తావన వచ్చినట్లు సమాచారం. శుభాంశు శుక్లా సాధించిన చారిత్రక మిషన్ను ప్రశంసిస్తూ ఇవాళ పార్లమెంట్లో ప్రత్యేక చర్చ జరిగింది. దేశం మొత్తం ఆయనను అభినందించింది. ఆయన విజయం యువతకు స్ఫూర్తినిస్తుందని, అంతరిక్ష రంగంలో భారతదేశం సాధిస్తున్న విజయాలకు ఇది ఒక మైలురాయి అని పార్లమెంట్ సభ్యులు కొనియాడారు. ఈ మిషన్ భారతదేశ అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలిచిపోతుంది.

## ఆపరేషన్ సిందూర్ వేళ.. కరాచీ నుంచి పరారైన నౌకలు

భారత్‌పాకిస్థాన్ లమధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్ లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారత్ సైనిక బలగాల దాడుల భయంతో పాకిస్తాన్, నౌకాదళం తమ ప్రధాన స్థావరాల్ని వదిలి పారిపోయినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత క్షిపణుల నుంచి తమ యుద్ధ నౌకలను కాపాడుకునేందుకు పాక్ నేవీ వాటిని కరాచీ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. ఈ కీలక విషయం తాజాగా బయటపడిన ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక సేకరించిన శాటిలైట్ చిత్రాల ప్రకారం, మే 8వ తేదీన కరాచీ నౌకాశ్రయం దాదాపు ఖాళీగా కనిపించింది. అయితే, రెండు రోజుల తర్వాత మే 10వ తేదీన,కరాచీకి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్వాదర్ పోర్టులో ఏకంగా ఏడు పాక్ యుద్ధ నౌకలు నిలిపి ఉంచినట్లు స్పష్టంగా నమోదైంది. మరికొన్ని నౌకలను వాణిజ్య టెర్మినల్లలో,ఇరాన్ సరిహద్దులకు సమీపంలోని జిల్లాల్లో దాచిపెట్టినట్లు సమాచారం. పాకిస్తాన్ తరలించిన నౌకల్లో పాకిస్తాన్ ఆరునెలల క్రితమే చైనా నుంచి కొనుగోలు చేసిన నాలుగు శక్తిమంతమైన 'జుల్ఫికర్' శ్రేణి ఫ్రిగేట్లు కూడా ఉన్నాయి. ఈ నౌకలను పారంభించినప్పుడు పాక్ నేవీ యాంటీషిప్ మిసైల్స్ ప్రయోగించిన వీడియోలను విడుదల చేసి గొప్పగా ప్రచారం చేసుకుంది పాక్. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం భారత దాడి భయంతో వాటిని ప్రధాన స్థావరం నుంచి తరలించడం గమనార్హం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







## "మన రాష్ట్రం-మన దుకాణం" నినాదంతో...

# గో బ్యాక్ మార్వాడి ఉద్యమం

- ఉద్యమ బలోపేతానికి పిడమర్తి రవి ముందడుగు
- నేడు హైదరాబాద్ బషీర్ భాగ్ ప్రెస్ క్లబ్ లో ఉద్యమ ఆవిర్భావ సభ
- ఇది తెలంగాణ ఉద్యమకారుల పోరాటం

హైదరాబాద్,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ బచావో మూవెంట్ (టిబిఎం) ఆధ్వర్యంలో నేడు బషీర్ భాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరుగనున్న ఆవిర్భావ సమావేశం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమంలో సుదీర్ఘకాలంగా స్ఫూర్తిదాయకమైన నాయకత్వం వహిస్తున్న డాక్టర్ పిడమర్తి రవి నేతృత్వం వహిస్తున్న ఈ సమావేశం, "గో బ్యాక్ మార్వాడి" ఉద్యమానికి బలాన్ని చేకూర్చనుంది.

### మార్వాడి కల్తీ వ్యాపారుల ఆధిపత్యం – స్థానికుల ఆర్థిక స్థితిపై ముప్పు

తెలంగాణలో వ్యాపార రంగాన్ని పట్టిపీడిస్తున్న మార్వాడి కల్తీ వ్యాపారుల విధానాలు స్థానిక వర్తకులు, కార్మిక వర్గాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అధిక వడ్డీ రుణాలు, ధరల కట్టుబాటు, స్థానిక వ్యాపారుల అవకాశాలను కొట్టివేయడం వల్ల సమాజంలో అసంతృప్తి పెరుగుతోంది. ఈ పరిణామాల మధ్య "గో బ్యాక్ మార్వాడి" ఉద్యమం ఒక అవసరమైన దిశగా నిలుస్తోంది. ఉద్యమ బలోపేతానికి పిడమర్తి రవి ముందడుగు టిఎస్ఎం (టిబిఎం) ఈ దశలో కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతుండగా, పిడమర్తి రవి ప్రత్యక్షంగా ఈ ఉద్యమాన్ని నడిపించేందుకు ముందుకు రావడం ప్రాధాన్యంగా మారింది. తెలంగాణ ఉద్యమంలో ఒక దశలో విద్యార్థి సమూహాలకు అండగా నిలిచిన ఆయన, ఇప్పుడు సామాజిక సమానత్వం, ఆర్థిక న్యాయం కోసం వేదికపైకి రావడం ద్వారా ఈ పోరాటానికి మరింత బలం చేకూర్చుతున్నారు.

### ప్రజా మద్దతు, ఐక్యత – విజయానికి మూల సూత్రం

పిడమర్తి రవి పిలుపుతో ఇప్పటికే ప్రజా సంఘాలు, స్థానిక వర్తక వర్గాలు మద్దతు తెలుపుతున్నాయి. నేడు జరగనున్న సమావేశం ద్వారా తెలంగాణ యువత, స్థానిక వర్గాలు ఐక్యంగా ముందుకు రావడం ఖాయమని అంచనాలు ఉన్నాయి. "జై తెలంగాణ ఉద్యమ కారుల హక్కుల హోరెత్తు" అనే నినాదం ఈ ఉద్యమానికి కొత్త ఊపును ఇస్తోంది.




### నేటి ఆవిర్భావ సభలో ఉద్యమానికి భవిష్యత్ దశ దిశ నిర్దేశం

నేడు జరగనున్న సమావేశం తర్వాత ఈ ఉద్యమం మరింత క్రమబద్ధంగా సాగనుంది. తెలంగాణ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోకుండా కాపాడడం లక్ష్యంగా ఈ ఉద్యమం ఒక కొత్త అధ్యాయం ఆరంభించనుందన్న నమ్మకం ఉంది. పిడమర్తి రవి నాయకత్వంలో "గో బ్యాక్ మార్వాడి" ఉద్యమం తెలంగాణ ఆత్మగౌరవానికి, స్థానిక వ్యాపారుల బతుకుదెరువుకు ప్రతీకగా నిలవనుంది.

## పానీ పూరీ – మార్వాడీ గో బ్యాక్ ఉద్యమ సభకు ఎంహెచ్పిఎస్ పూర్తి మద్దతు

- మైస ఉపేందర్ మాదిగ,
- ఎంహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు

హైదరాబాద్,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):

రాజధాని హైదరాబాదు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆగస్టు 20న మధ్యాహ్నం రెండు గంటలకు "పానీ పూరీ - మార్వాడీ గో బ్యాక్" ఉద్యమ ఆవిర్భావ సభ నిర్వహించనున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకుడు, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి నాయకత్వంలో ఈ సభ జరగనుంది.



ఈ సందర్భంగా మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బతుకుదెరువు కోసం తెలంగాణకు వచ్చి ఆర్థిక పరిపుష్టి సాధించిన ఉత్తరాది మార్వాడీలు స్థానికులపై ఆధిపత్యం ప్రదర్శించడం, దాడులు చేయడం అంగీకారయోగ్యం కాదని ఆయన విమర్శించారు.

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకునే దిశగా ఈ ఉద్యమ సభ మొదటి అడుగని ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి తెలంగాణ వర్తక సంఘాలు, స్థానిక వ్యాపారులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజలు తమ గళాన్ని బలంగా వినిపించబోతున్నారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## మార్వాడీ గో బ్యాక్ ఉద్యమానికి కేయూ జేఏసీ సంపూర్ణ మద్దతు

- మన రాష్ట్రంలో మన వ్యాపారం,
- మన ఉద్యోగాలు నినాదం
- ఆగస్టు 20న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉద్యమ ఆవిర్భావసభ
- బొల్లికొండ వీరేందర్,కేయూ జేఏసీ అధ్యక్షులు

హైదరాబాద్,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):

రాజధాని హైదరాబాదు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆగస్టు 20న మధ్యాహ్నం రెండు గంటలకు "పానీ పూరీ - మార్వాడీ గో బ్యాక్" ఉద్యమ ఆవిర్భావ సభ జరగనుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకుడు డా. పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించనున్నట్లు కేయూ జేఏసీ అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్ తెలిపారు.



తెలంగాణ రాష్ట్రంలో "మన రాష్ట్రంలో మన వ్యాపారం - మన వ్యాపారాలలో మన ఉద్యోగాలు" అనే నినాదంతో ఈ సభ నిర్వహించబడనుందని ఆయన వివరించారు. బతుకుదెరువు కోసం వచ్చి ఆర్థికంగా బలపడ్డ ఉత్తరాది మార్వాడీలు స్థానిక వ్యాపారులపై పెత్తనం చూపడం, వ్యాపారరంగాల్లో ఆధిపత్యం ప్రదర్శించడం అంగీకారయోగ్యం కాదని వీరేందర్ విమర్శించారు. అలాగే మార్వాడీలు నిర్వహించే వ్యాపారాల్లో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా నిరుద్యోగులుగా మిగిల్చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయానికి ప్రతిఘటించే ఉద్దేశంతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సభకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వర్తక సంఘాలు, స్థానిక వ్యాపారులు, ప్రజా సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బొల్లికొండ వీరేందర్ పిలుపునిచ్చారు.

# ముంబైలో భారీ వర్షాలు, వరదలు

ముంబై నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి, దీంతో సాధారణ జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఎక్కడ చూసినా రోడ్లన్నీ వరద నీటితో నిండిపోయాయి. దీనితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి, పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఇది నగరంలో సాధారణ కార్యకలాపాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. ముంబైతో పాటు మహారాష్ట్రలోని రాయగఢ్, రత్నగిరి, సతారా, కొల్హాపూర్, పుణే వంటి అనేక జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. దీని అర్థం ఈ ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ముంబై సహా ప్రభావిత జిల్లాల్లోని అధికారులు రేపు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రులకు కొంత ఉపశమనం కలిగించింది. ఈ సెలవుల కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండగలుగుతారు. పరిస్థితి సాధారణ స్థాయికి వచ్చేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.







Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in